సాక్షి
నిజామాబాద్

సోమవారం । 17 । ఫిబ్రవరి । 2025



ఆన్‌లైన్ సేవలకు..
నిజామాబాద్ కార్పొరేషన్‌లో ఇంటర్‌నెట్ సేవలు నిలిచిపోయాయి. వారం రోజులుగా ఆన్‌లైన్ సేవలకు అంతరాయం ఏర్పడింది.
- 8లో ▸



బండరాళ్లు పెట్టి..
పంట దిగుబడులను రోడ్లపై ఆరబోస్తున్న రైతులు చుట్టూ రాళ్లను పెడుతుండడంతో వాహనదారులు ఆందోళన చెందుతున్నారు.
- 8లో ▸

గరిష్టం/కనిష్టం
37.5 /12.5

వాతావరణం
ఉదయం చలి గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

ఇంధనాన్ని పొదుపుగా వాడుకోవాలి



సుభాష్‌నగర్: కాలుష్యరహిత సమాజ నిర్మాణంలో భాగంగా ఇంధనాన్ని పొదుపుగా వాడుకొని భవిష్యత్ తరాలకు అందించాలని హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్) ఆర్‌ఎం శ్రీనివాస్ పిలుపునిచ్చారు. నగరంలోని న్యూ కలెక్టరేట్ రోడ్డులో ఆదివారం హెచ్‌పీసీఎల్ ఆధ్వర్యంలో 'సాక్షం–2025' కార్యక్రమాన్ని నిర్వహించి ఇంధన పొదుపుపై అవగాహనా ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆర్‌ఎం మాట్లాడుతూ.. ఇంధన పొదుపులో భాగంగా ప్రత్యామ్నాయ వనరులైన సీఎన్‌జీ, ఎలక్ట్రికల్ వాహనాల వైపు వినియోగదారులు మొగ్గు చూపాలని సూచించారు. హెచ్‌పీసీఎల్ ఆఫీసర్ యతేంద్ర కోమా, డీలర్లు కర్క శ్రీకాంత్‌రెడ్డి, విజయ్‌నాథ్, వినోద్‌రెడ్డి, సందీప్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

బెంగళూరు బస్సుల్లో 10శాతం రాయితీ

- టీజీఎస్ ఆర్టీసీ ఆర్‌ఎం జ్యోత్స్న



ఖలీల్‌వాడి: హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్లే టీజీఎస్ ఆర్టీసీ ఏసీ బస్సుల్లో ప్రయాణించే వారికి టికెట్ చార్జీపై 10శాతం రాయితీ కల్పిస్తున్నట్లు ఆర్‌ఎం జ్యోత్స్న తెలిపారు. ఏసీ స్లీపర్, సీటర్, రాజధాని బస్సుల బేసిక్ టికెట్ చార్జీపై రాయితీ వర్తిస్తుందని పేర్కొన్నారు. ప్రయాణికులు ముందస్తు టికెట్ బుకింగ్ కోసం www.tgsrtcbus.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

రెండో విడత సర్వేకు ప్రత్యేక కౌంటర్లు

- నగరంలో ఆరు కేంద్రాలు ఏర్పాటు
- కులగణన వివరాల నమోదుకు మరో అవకాశం



నిజామాబాద్ సిటీ: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వే' కులగణన రెండో విడత ఆదివారం ప్రారంభమైంది. గతంలో చేపట్టిన కులగణనలో వివరాలు నమోదు చేసుకోని వారికి మరో అవకాశం కల్పించింది. అందులో భాగంగా మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఆదివారం రెండు కేంద్రాలను ప్రారంభించింది. పెద్దబజార్ వాటర్ ట్యాంక్, నాందేవ్‌వాడలోని వాటర్ ట్యాంక్ జోన్ కార్యాలయాల్లో సెంటర్లను ఏర్పాటు చేశారు. వీటితోపాటు మిగతా మూడు జోన్ కార్యాలయాలు, నగరపాలక సంస్థలో ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు కమిషనర్ దిలీప్‌కుమార్ తెలిపారు. సెంటర్‌లు ఉదయం 9 నుంచి సాయంత్రం 5గంటల వరకు తెరచి ఉంటాయని, వివరాలు సమర్పించాలనుకునే వారి కోసం దరఖాస్తుఫారాలను సిద్ధంగా ఉంచామని పేర్కొన్నారు. వివరాల నమోదుకు ఈ నెల 28వ తేదీ వరకు గడువు ఉందని తెలిపారు.

ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలి



నిజామాబాద్‌అర్బన్: ఎస్సీ వర్గీకరణను వెంటనే అమలు చేయాలని మాదిగ ఉద్యోగుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు మంద దేవేంద్ర ప్రసాద్ డిమాండ్ చేశారు. మాదిగ ఉద్యోగుల ఆధ్వర్యంలో నగరంలోని దీపక్ గార్డెన్‌లో ఆదివారం ఎస్సీ వర్గీకరణ విజయోత్సవ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు ఇచ్చిన చారిత్రాత్మక తీర్పును అమలు చేస్తానన్న సీఎం రేవంత్‌రెడ్డి.. వెంటనే చట్టబద్ధత కల్పించి వర్గీకరణ అమలు చేయాలన్నారు. ఏ, బీ, సీ గ్రూపులలో ఉన్న అసమానతలను సరిచేయాలని డిమాండ్ చేశారు. వర్గీకరణ విషయంలో అలుపెరుగని పోరాటం చేసిన మంద కృష్ణ మాదిగ పిలుపులో మాదిగ ఉద్యోగులంతా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మాదిగ ఉద్యోగుల సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేశ్, విశ్రాంత ఉద్యోగులు తెడ్డు గంగారాం, నాంపల్లి మహేశ్, బాబా శ్రీనివాస్, శ్రీనివాస్, మారుతి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆగడాలకు అడ్డేది..?



■ మాక్లూర్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతికి ఓ ఆర్‌ఎంపీ అబార్షన్ మాత్రలు రిఫర్ చేశాడు. ఆ మాత్రలు వికటించి యువతి మృతిచెందింది. సదరు వైద్యుడిపై పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

■ ఉమ్మడి నందిపేట్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన మహిళకు కడుపు నొప్పి రావడంతో కుటుంబసభ్యులు వెంటనే గ్రామంలోని ఆర్‌ఎంపీకి ఫోన్ చేశారు. ఆగమేఘాల మీద వారి ఇంటికి చేరిన ఆర్‌ఎంపీ ఒక ఇంజెక్షన్ ఇచ్చి వెళ్లిపోయాడు. తెల్లవారుజామున 5 గంటలకు మళ్లీ కడుపునొప్పి రావడంతో ఆర్‌ఎంపీకి ఫోన్ చేసి విషయం తెలుపగా, నిజామాబాద్‌కు తీసుకెళ్లాలని సలహా ఇచ్చాడు. ఆమెను నిజామాబాద్‌కు తరలించిన కుటుంబ సభ్యులు రెండుమూడు ఆస్పత్రుల చుట్టూ తిరిగినా ఫలితం లేకుండాపోయింది. చివరకు సదరు మహిళ కన్నుమూసింది. ఆర్‌ఎంపీ హైడోస్ ఇంజెక్షన్ చేయడం వల్లే ఇలా జరిగిందని కుటుంబ సభ్యులు బోరున విలపించారు.

- నకిలీ వైద్యులపై పూర్తిస్థాయి చర్యలేవి..
- తనిఖీలతో హడలెత్తించి మౌనంగా ఉన్న అధికారులు
- మళ్లీ జోరందుకున్న 'వైద్య వ్యాపారం'
- దర్జాగా సాగుతున్న రిఫరల్ దందా



ఆర్‌ఎంపీపై కేసు వివరాలను వెల్లడిస్తున్న నిజామాబాద్ ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి (ఫైల్)



నిజామాబాద్ నగరంలోని వర్నిరోడ్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న వైద్య మండలి అధికారులు (ఫైల్)

నిజామాబాద్‌నాగారం: అర్హతతో సంబంధం లేకుండా ప్రజలకు వైద్యం చేస్తున్నవారిపై కన్నెర్ర చేసిన తెలంగాణ వైద్య మండలి అధికారులు.. ఆ తర్వాత పత్తా లేకుండాపోయారు. దీంతో వారు మళ్లీ దర్జాగా దందా సాగిస్తున్నారు. పల్లె, పట్టణం తేడాలేకుండా.. విద్యార్హతతో సంబంధం లేకుండానే డాక్టర్లుగా బోర్డులు ఏర్పాటు చేసుకుంటున్న ఆర్‌ఎంపీ, పీఎంపీలు తమ వద్దకు వచ్చే వారికి యాంటీబయాటిక్స్, హైడోస్ మాత్రలు ఇస్తూ ప్రాణాల మీదకు తెస్తున్నారు. జిల్లాలో చోటు చేసుకున్న పలు ఘటనల నేపథ్యంలో వైద్య మండలి అధికారులు అప్రమత్తమై నవంబర్ 28, 29 తేదీల్లో జిల్లాలోని ఆర్‌ఎంపీ, పీఎంపీల క్లినిక్‌లలో తనిఖీలు చేపట్టారు. ఎనిమిది మందిపై కేసులు నమోదు చేశారు. వైద్యం వికటించి యువతి మృతికి కారణమైన ఒకరిని గత నెలలో పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఆ తరువాత అధికారులు మౌనంగా ఉండిపోయారు. కొంత మంది ఆర్‌ఎంపీలు, పీఎంపీలు ప్రభుత్వంలోని పలువురు పెద్దలను కలవడంతోనే తనిఖీలకు బ్రేక్ పడిందనే చర్చ సాగుతోంది. తనిఖీలతో హడావుడి చేసిన అధికారులు ప్రస్తుతం కనిపించకపోవడంతో ఆర్‌ఎంపీ, పీఎంపీల ఆగడాలు మళ్లీ జోరందుకున్నాయి.

30 నుంచి 50 శాతం కమీషన్..

జిల్లాలో వందల సంఖ్యలో ప్రైవేట్ ఆస్పత్రులు ఉన్నాయి. జిల్లా కేంద్రంలోని ఖలీల్‌వాడి, ద్వారకనగర్, ప్రగతినగర్, పోచమ్మగల్లీ, హైదరాబాద్‌రోడ్, బోధన్ రోడ్, కంఠేశ్వర్ తదితర ప్రాంతాల్లో సుమారు 300లకుపైగా ప్రైవేట్ ఆస్పత్రులున్నాయి. వీటితోపాటు బోధన్, ఆర్మూర్, భీమ్‌గల్ మున్సిపాలిటీ పరిధిలో పదుల సంఖ్యలో, ఆయా మండల కేంద్రాల్లో రెండుమూడు చొప్పున ప్రైవేట్ ఆస్పత్రులు నడుస్తున్నాయి. తమ వద్దకు వచ్చే రోగులకు అర్హతతో సంబంధం లేకుండా రెండు మూడు రోజులపాటు వైద్యం చేస్తున్న పలువురు ఆర్‌ఎంపీలు, పీఎంపీలు.. ఆ తరువాత ప్రైవేట్ ఆస్పత్రులకు రిఫర్ చేస్తున్నారు. కొంత మంది తమ సొంత వాహనాల్లోనే రోగులను తీసుకువచ్చి అడ్మిట్ చేస్తుండడం గమనార్హం. రోగులనుంచి ముక్కుపిండి వేలాది రూపాయలు వసూలు చేస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల నిర్వాహకులు అందులో 30 నుంచి 50 శాతం మొత్తాన్ని ఆర్‌ఎంపీ, పీఎంపీలకు కమీషన్‌గా చెల్లిస్తున్నారనేది బహిరంగ రహస్యమే.

ఫిర్యాదులు చేస్తే చర్యలు



జిల్లాలో నకిలీ వైద్యులు, ఆస్పత్రులపై తనిఖీలను మెడికల్ కౌన్సిల్ అధికారులు చూసుకుంటున్నారు. ఇప్పటికే నకిలీ వైద్యులపై చర్యలు తీసుకున్నారు. మళ్లీ తనిఖీలు చేపడతారు. జిల్లాలో ఎవరైనా అర్హతకు మించి వైద్యం చేస్తున్నట్లు తెలిస్తే ఫిర్యాదు చేయాలి.

– రాజశ్రీ, డీఎంహెచ్‌వో

పసుపు ధరను వ్యాపారులు తగ్గించారు



ముప్కాల్‌లో మీడియాతో మాట్లాడుతున్న అన్వేష్‌రెడ్డి

- బోర్డుకు విధివిధానాలు లేవు
- జిల్లాలో కార్యాలయం ఎక్కడ ఉంది..
- పసుపునకు డిమాండ్ ఉన్నా ధర ఎందుకు దక్కడం లేదు?
- సిండికేట్‌గా మారిన ఎర్రజొన్నల వ్యాపారులు
- రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ సుంకెట్ అన్వేష్‌రెడ్డి

బాల్కొండ: పసుపు ధరను వ్యాపారులు తగ్గించారని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ సుంకెట్ అన్వేష్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ముప్కాల్ మండల కేంద్రంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం పసుపు బోర్డు ప్రకటించినప్పటికీ నిజామాబాద్‌లో కార్యాలయం ఎక్కడ ఉందో కనిపించడం లేదని అన్నారు. కేంద్ర బడ్జెట్‌లో పసుపు బోర్డుకు ఎందుకు నిధులు కేటాయించలేదో ఎంపీ ధర్మపురి అర్వింద్ రైతులకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బోర్డుకు స్పష్టమైన విధి విధానాలు లేకపోవడం కారణంగా రైతులకు ధర దక్కడం లేదని, కేంద్ర ప్రభుత్వం స్పందించి మద్దతు ధర ప్రకటించాలన్నారు. ఓ వైపు జిల్లాలో పసుపు సాగు విస్తీర్ణం తగ్గగా, మరో వైపు మార్కెట్‌లో డిమాండ్ ఉందని, అయినప్పటికీ ధర ఎందుకు పలకడం లేదని ప్రశ్నించారు. పసుపు, ఎర్రజొన్న రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని స్పష్టం చేశారు. గత వారం రోజులుగా వ్యాపారులు సిండికేట్‌గా మారి జొన్న ధరను తగ్గించేందుకు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. వ్యాపారుల సిండికేట్‌కు అడ్డుకట్ట వేయాలని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు విన్నవిస్తామని, అలాగే ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు.

ప్రభుత్వమే కొనుగోలు చేయాలి..

నిజామాబాద్ మార్కెట్‌లోకి ఇతర వ్యాపారులను రానివ్వకపోవడంతోనే సాంగ్లీ మార్కెట్‌లో పసుపు ధర ఎక్కువ పలుకుతోందని రైతు ఐక్య కార్యాచరణ కమిటీ నాయకుడు ప్రభాకర్ అన్నారు. ఎమ్మెస్పీలో పసుపును చేర్చాలని డిమాండ్ చేశారు. నిజామాబాద్ ఏఎంసీలో పసుపు చోరీ ఘటనలో కార్మికులందరినీ దొంగలు అనడం సరికాదని, చోరీ చేసిన వారికి శిక్ష పడాల్సిందేనని పేర్కొన్నారు. ఎర్రజొన్న విత్తనాలను ప్రభుత్వమే సరఫరా చేసి దిగుబడిని కూడా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో డీసీసీ ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, వేల్పూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ జైడి రవి, కిసాన్‌ఖేత్ మండల అధ్యక్షుడు సాగర్‌రెడ్డి, నాయకులు ముత్యంరెడ్డి, మల్లారెడ్డి, ముస్కు మోహన్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రిలే నిరాహార దీక్ష



ఆర్మూర్‌టౌన్: పసుపు క్వింటాల్‌కు రూ.17వేల మద్దతు ధర చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం నుంచి రిలే నిరాహార దీక్షలు చేపట్టనున్నట్లు అంకాపూర్ గ్రామానికి చెందిన రైతు కొమ్ముల వినోద్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆయన పలువురు రైతులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. పసుపునకు మద్దతు ధర కోసం ఆర్మూర్‌లోని అంబేడ్కర్ చౌరస్తాలో సోమవారం నుంచి ఐదు రోజులపాటు రిలే దీక్షలు చేపడతామన్నారు. గతేడాది క్వింటాల్‌కు రూ.15 వేలు పలకగా, ప్రస్తుతం రూ.10,800 ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. రిలే దీక్షలో ఆర్మూర్, బాల్కొండ, నిజామాబాద్ రూరల్, నిర్మల్, మెట్‌పల్లి నియోజకవర్గాల రైతులు పాల్గొనాలని ఆయన కోరారు. సమావేశంలో రైతులు వెల్మ ముత్యం రెడ్డి, నక్కల రాములు, వన్నెల గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ వైఖరి స్పష్టంచేయాలి

- బీసీ కులగణన చేయాలా? వద్దా?
- అరవింద్ సోయిలేకుండా మాట్లాడుతుండు
- కవిత తన స్థాయిని తగ్గించుకోవద్దు
- డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి

నిజామాబాద్ సిటీ: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బీసీ కులగణనపై బీజేపీ తన వైఖరిని స్పష్టం చేయాలని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. జిల్లాకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ నగర అధ్యక్షుడు, నుడా చైర్మన్ కేశ వేణుతో కలిసి ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కులగణనపై ఎంపీ అర్వింద్, ఎమ్మెల్సీ కవిత, మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి తలాతోక లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. బీసీలపై ఎప్పుడూ నోరుమెదపని కవిత కొత్తగా బీసీ నినాదం ఎత్తుకున్నారని, అనవసర వ్యాఖ్యలు చేస్తూ తన స్థాయిని తగ్గించుకోవద్దని సూచించారు. కాంగ్రెస్ పార్టీకి ఎమ్మెల్సీ అభ్యర్థులే లేరని ఎంపీ అరవింద్ సోయిలేకుండా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. జిల్లాకు అప్పుడప్పుడు వస్తూ ప్రభుత్వంపై ఏది పడితే అది మాట్లాడితే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. రెడ్డి కులస్తుడై కూడా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీసీల కోసం కుల గణన చేస్తుంటే అనవసర వ్యాఖ్యలుచేస్తున్నారని, అసలు కుల గణన చేయాలా? వద్దా? అనేది బీజేపీ నేతలు బండి సంజయ్, లక్ష్మణ్ స్పష్టం చేయాలన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ బలపర్చిన నరేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలని కోరారు. సమావేశంలో నాయకులు నరాల రత్నాకర్, రామర్తి గోపి, వేణురాజ్, నరేందర్‌గౌడ్, జావీద్ అక్రం, గడుగు రోహిత్, ప్రీతమ్ తదితరులు పాల్గొన్నారు.

ముస్లింల కోసమే కులగణన

- కులాలపై రేవంత్‌కు అవగాహన లేదు
- ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేకే మరోసారి సర్వే
- నిరుద్యోగులు, ఉపాధ్యాయులను కాంగ్రెస్ మోసం చేసింది
- రాజ్యసభ ఎంపీ, బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కే లక్ష్మణ్



మాట్లాడుతున్న రాజ్యసభ ఎంపీ, బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కే లక్ష్మణ్

సుభాష్‌నగర్: ముస్లింల కోసమే సీఎం రేవంత్‌రెడ్డి కులగణన చేశారని రాజ్యసభ ఎంపీ, బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కే లక్ష్మణ్ ఆరోపించారు. కులగణన పేరుతో కులాల మధ్య చిచ్చు పెట్టేందుకు కుట్ర పన్నుతున్నారన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఎంపీలు అరవింద్ ధర్మపురి, గొడెం నగేశ్‌తో కలిసి ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బీసీల్లో ముస్లింలను చేర్చడాన్ని ఎవరూ సహించడం లేదన్నారు. కులాల మీద రేవంత్‌రెడ్డికి అవగాహన లేకపోగా, కులగణనపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని, అందుకే మరోసారి సర్వే చేపడుతున్నారన్నారు. అమలుసాధ్యం కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నిరుద్యోగులను, ఉపాధ్యాయులను మోసం చేసిందని, ఆ పార్టీకి ఎందుకు ఓటు వేయాలని ప్రశ్నించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్‌కు అభ్యర్థులు కరువయ్యారని, కాంగ్రెస్ తన అభ్యర్థిని అరువు తెచ్చుకుని పోటీ చేస్తోందని అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ కనీసం పోటీ చేసే స్థాయిలో కూడా లేదని, ఆ పార్టీ గురించి మాట్లాడే పని లేదన్నారు. విద్యాసంస్థలను కాపాడుకోవడం కోసమే నరేందర్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరారని ఆరోపించారు. రాష్ట్రంలో బీజేపీ గాలి వీస్తోందని, తమ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

మోదీని విమర్శించేస్థాయి రేవంత్‌కు లేదు

మోదీ కులం గురించి రేవంత్ మాట్లాడటం సిగ్గుచేటని, ఆయనను విమర్శించేస్థాయి రేవంత్‌కు లేదని ఎంపీ అర్వింద్ ధర్మపురి అన్నారు. త్వరలోనే బీఆర్ఎస్ దుకాణం మూతపడటం ఖాయమన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థులు చిన్నమైల్ అంజిరెడ్డి, మల్క కొమరయ్య, నిజామాబాద్ అర్బన్, ఆర్మూర్ ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ, పైడి రాకేశ్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ పటేల్ కులాచారి, వడ్డి మోహన్‌రెడ్డి, నాగోళ్ల లక్ష్మీనారాయణ, న్యాలం రాజు, మాజీ కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

హోదా పెరిగినా.. ప్రాధాన్యం కరువే!

- ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంలపై వివక్ష
- కాంప్లెక్స్ సమావేశాల్లో దక్కని కార్యదర్శి హోదా?
- పరీక్షలు, ఎన్నికల విధుల్లోనూ పట్టించుకోని వైనం
- ఉత్తర్వులకు తూట్లు పొడుస్తున్న విద్యాశాఖ అధికారులు
- సమాన హక్కుల కోసం పీఎస్‌హెచ్‌ఎంల పోరాటం



డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): ప్రాథమిక విద్యా వ్యవస్థలో సీనియర్ ప్రధానోపాధ్యాయులకు హోదా పెరిగినా దక్కాల్సిన హక్కులు దక్కకపోగా.. బాధ్యతలు ఇవ్వడం లేదు. సరైన జాబ్‌చార్ట్ లేక అన్నింటా వివక్ష ఎదురవుతోంది. పాఠశాల సముదాయ సమావేశాలను కార్యదర్శి హోదాలో నడిపించాల్సిన పీఎస్‌హెచ్‌ఎంలు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుల నిర్లక్ష్యంతో ఇబ్బందులు పడుతున్నారు. సీనియర్ ఎస్జీటీలుగా పరిగణిస్తుండడంతో బదిలీల్లోనూ పీఎస్‌హెచ్‌ఎంలు వివక్ష ఎదుర్కొంటున్నారు. 150 మంది విద్యార్థులు ఉన్న ప్రాథమిక పాఠశాలల్లో పీఎస్‌హెచ్‌ఎం పోస్టును ఇవ్వాలనే నిబంధన ఉంది. కానీ, ఇటీవల జరిగిన పదోన్నతుల్లో 50 మంది కంటే తక్కువ ఉన్న పాఠశాలల్లోని పోస్టును విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్న పాఠశాలలకు బదిలీ చేయకుండా వదిలేశారు.

ఇతర విధుల్లోనూ వివక్షే..

పీఎస్‌హెచ్‌ఎం పోస్టు, స్కూల్ అసిస్టెంట్‌తో సమాన గ్రేడ్ కలిగిన పోస్టు. ఇటీవల చేపట్టిన కులగణనలో హోదాకు తగిన సూపర్‌వైజర్ బాధ్యతలు ఇవ్వకుండా ఎన్యుమరేటర్లుగా ఎంపిక చేశారు. ఎన్నికల విధుల్లో సీనియర్ స్కూల్ అసిస్టెంట్లకు సహాయ రిటర్నింగ్ అధికారిగా బాధ్యతలు ఇచ్చి, అదే సమాన హోదా కలిగిన ఎల్‌ఎఫ్‌ఎల్(లో ఫిమేల్ లిటరసీ) హెచ్‌ఎంలకు మొండిచేయి చూపారు. పదో తరగతి పరీక్షల్లో డిపార్ట్‌మెంటల్ అధికారులు, కార్ కస్టోడియన్ అధికారులుగా స్కూల్ అసిస్టెంట్లకు అవకాశమిస్తూ.. పీఎస్‌హెచ్‌ఎంలకు మాత్రం ప్రాధాన్యం ఇవ్వడం లేదు.

పీఎస్‌హెచ్‌ఎంల సమస్యలు.. డిమాండ్లు

- హేతుబద్ధీకరణ నిబంధనల్లో భాగంగా హైస్కూల్ హెచ్‌ఎంలను వేరుగా లెక్కకట్టినట్లు, పీఎస్‌హెచ్‌ఎంలను లెక్కకట్టాలి.
- విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా ప్రతి పాఠశాలకు ఒక పీఎస్‌హెచ్‌ఎంను నియమించాలి.
- అర్హతలున్న సీనియర్ పీఎస్‌హెచ్‌ఎంలకు మండల నోడల్ అధికారిగా పోస్టింగ్ ఇవ్వాలి.
- జాబ్‌చార్ట్‌ను రూపొందించడంతోపాటు బాధ్యతలు, విధులను పొందుపర్చాలి.
- పదేళ్ల సర్వీసును పూర్తిచేసుకున్న పీఎస్‌హెచ్‌ఎంకు గెజిటెడ్ హోదా ఇవ్వాలి.

కార్యదర్శి హోదా కల్పించాలి



కాంప్లెక్స్ పరిధిలోని సీనియర్ ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎంకు ఉత్తర్వు నెంబర్ 6225 ప్రకారం కాంప్లెక్స్ సమావేశంలో కార్యదర్శి హోదా కల్పించాలి. బదిలీల్లోనూ వివక్ష ఎదురవుతోంది. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– సీహెచ్ చెన్నయ్య, పీఎస్‌హెచ్‌ఎం అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు

రేషనలైజేషన్‌లో ఎస్జీటీగా పరిగణించొద్దు



ప్రాథమిక పాఠశాలలకు సంబంధించి రేషనలైజేషన్ ప్రక్రియ జరిపేటప్పుడు ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎంను సీనియర్ ఎస్జీటీగా పరిగణిస్తున్నారు. దీంతో ఎస్జీటీ పోస్టులను కోల్పోవాల్సి వస్తోంది. ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలను ఎలా పరిగణిస్తారో పీఎస్‌హెచ్‌ఎంలను కూడా అదే విధంగా పరిగణించాలి.

– జి ప్రశాంత్, పీఎస్‌హెచ్‌ఎం అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి

ప్రాథమిక పాఠశాలకు హెచ్‌ఎంను నియమించాలి



చాలా ప్రభుత్వ పాఠశాలల్లో పర్యవేక్షణకు పీఎస్‌హెచ్‌ఎంలు లేరు. పీఎస్‌లలో తరగతికి ఒక ఉపాధ్యాయుడిని, ప్రతి ప్రాథమిక పాఠశాలకు ఒక హెచ్‌ఎంను నియమించాలి.

– అంకం నరేశ్, ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం, రేకులపల్లి

క్లుప్తంగా

దేశ వైభవానికి దిక్సూచి ఆర్‌ఎస్‌ఎస్



సుభాష్‌నగర్: భారతదేశ వైభవానికి ఆర్‌ఎస్‌ఎస్ దిక్సూచిలాంటిందని ఆర్‌ఎస్‌ఎస్ విభాగ్ శారీరక్ ప్రముఖ్ జ్యోతి భద్రయ్య అన్నారు. నగరంలో ఆదివారం వశిష్ట మహర్షి శాఖ వార్షికోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంఘ శాఖ సంస్కారానికి కేంద్రమని, బాల స్వయం సేవకులలో దేశభక్తి, క్రమ శిక్షణ, ఏకాగ్రత ఐకమత్యం తదితర లక్షణాలు వికసిస్తాయన్నారు. భారతదేశ అసలైన చరిత్రను అధ్యయనం చేసే అవకాశం శాఖలో లభిస్తుందని తెలిపారు. స్వయంసేవకులు దేశం కోసం ఎలాంటి త్యాగాలైనా చేయడానికి సిద్ధంగా ఉంటారన్నారు. కుంభమేళాలో కూడా స్వయం సేవకులు సేవా కార్యక్రమాలు చేశారన్నారు. నగర కార్యవాహ సత్యం, సహ కార్యవాహ సుమిత్, అనిల్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ప్రయోగ పరీక్ష కేంద్రాల తనిఖీ



నిజామాబాద్‌అర్బన్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రయివేటు జూనియర్ కళాశాలల్లో మూడో స్పెల్ ప్రయోగ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి.ఆదివారం పలు ప్రయోగ పరీక్ష కేంద్రాలను జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారి రవికుమార్ తనిఖీ చేశారు.ప్రతి పరీక్ష కేంద్రంలో కెమెరాలు పనిచేస్తున్న విషయాన్ని స్వయంగా ఇంటర్ విద్యాశాఖ అధికారి, పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు పరిశీలించి సమీక్షించారు.

సీఐపై చర్యలు తీసుకోవాలి



బోధన్ టౌన్ (బోధన్): తనను బూతులు తిట్టి లాఠీతో కొట్టిన బోధన్ రూరల్ సీఐ విజయ్ బాబుపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని బాధిత మహిళ బోయి భాగ్య కోరారు. ఈమేరకు ఆదివారం ఆమె బోధన్ ఏసీపీ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఈ నెల 13న దూపల్లి గ్రామానికి చెందిన తాను ఎడపల్లి మండలం జానకంపేట్‌లోని లక్ష్మీనర్సింహస్వామి ఆలయ జాతరకు వచ్చి, పర్సు పోగొట్టుకున్నానన్నారు. పోలీసులకు పర్సు పోయిందని చెప్పగా, సీఐ తనను తిట్టి తన చేతిలో ఉన్న లాఠీతో కొట్టాడని ఆవేదన వ్యక్తం చేసింది. తనను తిట్టి లాఠీతో కొట్టిన సీఐపై చర్యలు తీసుకోవాలని కోరారు.

మట్టి గొబ్బలకు బదులు ప్లాస్టిక్ బాటిళ్లు



కల్లు తీయడానికి మట్టి గొబ్బలకు బదులు కట్టిన ప్లాస్టిక్ బాటిల్స్

సిరికొండ: తాటి చెట్ల నుంచి కల్లును తీయడానికి గౌడన్నలు చెట్లకు మట్టి గొబ్బలను కడుతుంటారు. సిరికొండలోని తాటి వనంలో ఓ చెట్టుకు మట్టి గొబ్బలకు బదులు ప్లాస్టిక్ బాటిళ్లను కట్టారు. ఈ దృశ్యాన్ని ఆదివారం 'సాక్షి' క్లిక్ మనిపించింది. మొదటి సారిగా తాటి చెట్లకు కల్లుగీసే ప్రాంతంలో మట్టిగొబ్బలు సరిగా ఉండడం లేదని బాటిళ్లను ఏర్పాటు చేసినట్లు గౌడన్నలు తెలిపారు.

బండరాళ్లు పెట్టి బలిచేయొద్దు

- బాల్కొండ మండలంలో జొన్న పంటను రోడ్లపై ఆరబెడుతున్న రైతులు
- రక్షణగా పక్కన రాళ్లు పెడుతున్న వైనం
- ప్రమాదం పొంచి ఉందంటున్న వాహనదారులు



నాగంపేట్ శివారులో తారు రోడ్డుపై ఆరబెట్టిన జొన్నల పక్కన బండరాళ్లు

బాల్కొండ: రైతులు తమ పంట దిగుబడులను తారు రోడ్లపై ఆరబెడుతూ, రక్షణగా బండరాళ్లను ఏర్పాటు చేస్తున్నారు. దీంతో రోడ్లపై రాళ్లతో వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని వాహనదారులు వాపోతున్నారు. ప్రస్తుతం జొన్న కోతలు జోరందుకోవడంతో రైతులు నూర్పిళ్లు చేసిన పంట దిగుబడులను తారు రోడ్లపై ఆరబెడుతున్నారు. అలా ఆరబెట్టిన జొన్నల పక్కన బండరాళ్లను, కర్రలను పెడుతున్నారు. దీంతో రోడ్డుపై ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. గతేడాది ముప్కాల్ మండలం రెంజర్ల శివారులో ఎర్ర జొన్నల పంటలకు అడ్డుగా పెట్టిన రాళ్ల కారణంగా ప్రమాదం సంభవించి అదే గ్రామానికి చెందిన యువకుడు మృత్యువాత పడ్డాడు. అంతేకాకుండ వేర్వేరు ఘటనల్లో పలువురు తీవ్రంగా గాయపడ్డారు. అయినా పాలకులు, అధికారులు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలేదు.

ఇదీ పరిస్థితి..

రోడ్లపై పంటల పక్కన ఏర్పాటు చేసిన రాళ్లను రాత్రివేళల్లో వాహనదారులు గుర్తించక ప్రమాదాలకు గురవుతున్నారు. మరికొంతమది రైతులు పంట దిగుబడులను తరలించిన కూడా రోడ్లపై బండరాళ్లను అలానే వదిలి వెళ్తున్నారు. అన్నదాతలు తారు రోడ్లపై పంట దిగుబడులను ఆరబెట్టినా, వారి పాట్లను గమనించి ప్రజలు ఎలాంటి ఫిర్యాదులు చేయడం లేదు. కాని బండరాళ్లను పెట్టడం వల్ల ప్రాణాలు పోతున్నాయని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. తారు రోడ్లపై ఇప్పటి నుంచి మే వరకు ఏదో ఒక పంట దిగుబడి వస్తూనే ఉంటుంది. జొన్నలు పూర్తయ్యేలోపు వరి పంటలు చేతికి వస్తాయి. దీంతో వరి ధాన్యం రోడ్లపై ఆరబెడుతారు. తర్వాత సజ్జ పంటలు చేతికి రాగానే వాటిని ఆరబెడుతారు. ఇలా ఏడాదిలో జూన్, జూలై, ఆగస్టు మాసాల్లోనే రోడ్లు ఖాళీగా ఉంటాయి. సెప్టెంబర్‌లో మక్కలు, నవంబర్, డిసెంబర్‌లో వానాకాలం వరి పంటలు, జనవరి, ఫిబ్రవరి, మార్చిలో జొన్న పంటలు ఇలా ఎప్పుడు రోడ్లు పంట దిగుబడులతోనే దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి రైతులకు ఇతర ప్రాంతాల్లో సిమెంట్ కళ్లాలను నిర్మించాలని, ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

కేసులు నమోదు చేస్తాం..

రోడ్లపై పంట దిగుబడులను ఆరబెడుతూ పక్కన రాళ్లు పెట్టిన వారిపై కేసులు నమోదు చేస్తాం. రాళ్ల కారణంగా వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. రైతులు ప్రయాణికుల ఇబ్బందులను కూడా అర్థం చేసుకోవాలి.

– రజనీకాంత్, ఎస్సై, ముప్కాల్



సింగీతం జెడ్పీహెచ్‌ఎస్ 2005-06 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు

అ'పూర్వ' సమ్మేళనం

నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్‌నగర్ మండలంలోని సింగీతం గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం 2005–06 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులందరూ ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో ఆప్యాయంగా మాట్లాడి, క్షేమ సమాచారం తెలుసుకున్నారు. ఆనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకొని, చదువులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు కలకొండ. నారాయణ, లతీఫ్, దమ్ము వెంకటేశ్వర్లు, విజయ్ కుమార్, పాపారావు,శంకర్, రమేష్ కృష్ణప్రసాద్, పూర్వ విద్యార్థులు రవీ, సందీప్‌గౌడ్, వీరేశం, మహందర్‌గౌడ్, రఫీ, దుర్గయ్య, శివకుమార్, కిరణ్, శ్రీకాంత్, చిరంజీవి, నగేష్, అఖిలేష్‌గౌడ్, దత్తయ్య, స్వరూప, శ్రీలత ఉన్నారు.

25 ఏళ్ల తర్వాత..

రామారెడ్డి: మండలంలోని రెడ్డిపేట గ్రామంలోగల మున్నూరుకాపు సంఘంలో ఆదివారం గ్రామంలోని జెడ్పీహెచ్‌ఎస్ 1998–99 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు సిల్వర్ జూబ్లీ సందర్భంగా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భంగా వారంతా ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో హర్షం వ్యక్తం చేశారు. ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఆహ్వానించి, సన్మానించారు. ఆనాటి హెచ్‌ఎం వెంకట్ గౌడ్, ఉపాధ్యాయులు దత్తాద్రి, శంకరయ్య మాట్లాడుతూ.. అప్పటి చదువుకు, ఇప్పటి చదువుకు ఉన్న వ్యత్యాసాన్ని వివరించారు. రెడ్డిపేట పాఠశాల చరిత్రలో మొట్టమొదటి ఆత్మీయ సమ్మేళనం అని ఆనందం వ్యక్తం చేశారు.



రెడ్డిపేట జెడ్పీహెచ్‌ఎస్ 1998-99 బ్యాచ్ ఎస్సెస్సీ విద్యార్థులు

ఆర్మూర్‌లో ప్రజాపాలన సేవ కేంద్రం ఏర్పాటు

ఆర్మూర్‌టౌన్ : మున్సిపల్ కార్యాలయంలో ప్ర జాపాలన సేవ కేంద్రం ఏర్పాటు చేశామని కమిషనర్ రాజు తెలిపారు. ప్రభుత్వం ఇటీవలే నిర్వహించిన కులగణన సర్వే పాల్గొనని 73 మందిని పట్టణంలో గుర్తించామన్నారు. ఈ నెల 16 తేదీ నుంచి 28 వరకు సర్వేలో పాల్గొనని వారు వివరాలను అందజేయాలని సూచించారు. సెలవు రోజులలో సైతం ప్రజాపాలన సేవ కేంద్రం ఉంటుందన్నారు.

వలకు చిక్కిన భారీ చేప



వేల్పూర్‌లో మత్స్యకారుడు కిషన్‌కు లభించిన భారీ చేప

వేల్పూర్: మండల కేంద్రంలో బండి కిషన్ అనే మత్స్యకారునికి ఆదివారం 15 కిలోల భారీ బొచ్చ చేప లభ్యమైంది. ఎప్పటిమాదిరిగానే తాను స్థానిక చెక్‌డ్యాంలో చేపల వేటకు వెళ్లగా భారీ చేప లభించినట్లు చెప్పాడు. భారీ చేప లభించడంతో ఆయన ఆనందం వ్యక్తం చేశాడు.

క్రైం కార్నర్

అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య



చంద్రమోహన్ (ఫైల్)

నిజాంసాగర్(జుక్కల్): జుక్కల్ మండలకేంద్రానికి చెందిన బెజ్జవార్ చంద్రమోహన్(34) అనే వ్యక్తి ఆదివారం ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై భువనేశ్వర్ తెలిపారు. వివరాలు ఇలా.. జుక్కల్‌కు చెందిన చంద్రమోహన్‌కు అప్పులు ఎక్కువవడంతో మద్యానికి బానిసయ్యాడు. శనివారం తాను అప్పులు తీర్చేది ఎట్లా అంటూ ఇంటి వద్ద రోధించి బయటకు వెళ్లి, తిరిగి రాలేదు. ఆదివారం తెల్లవారుజామున ఉప్పలంచవార్ లక్ష్మణ్ ఇంటి వద్ద ఉన్న పాడుబడ్డ బావిలో చంద్రమోహన్ శవమై కన్పించాడని ఎస్సై తెలిపారు. అప్పుల బాధతో అతడు ఆత్మహత్యకు పాల్పడ్డాడని, ఈమేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

అనారోగ్యంతో ఒకరు..

ఖలీల్‌వాడి: నగరంలోని సంజీవ్‌నగర్ కాలనీకి చెందిన వర్షపల్లి మల్లేష్(64) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై హరిబాబు ఆదివారం తెలిపారు. వివరాలు ఇలా.. మల్లేష్ గత కొన్ని సంవత్సరాల నుంచి బ్రెయిన్‌స్ట్రోక్ వ్యాధితో బాధపడుతున్నాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది శనివారం బాత్రూంలో ఉన్న ఫినాయిల్ తాగి, ఆత్మహత్యకు యత్నించారు. వెంటనే కుటుంబసభ్యులు అతడిని గమనించి, ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేసినట్లు తెలిపారు.

పేకాడుతున్న ఆరుగురి అరెస్టు

బోధన్‌రూరల్: సాలూర మండలకేంద్రంలో పేకాట ఆడుతున్న ఆరుగురిని పట్టుకున్నట్లు బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. అలాగే వారి వద్ద నుంచి రూ.11,600లు నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

బోధన్‌రూరల్: మండలంలోని కల్దుర్కి గ్రామం నుంచి అక్రమంగా బోధన్‌కు ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. పట్టుబడిన ట్రాక్టర్ సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించామని, కేసు నమోదు చేసినట్లు ఆయన వివరించారు.

మాజీ ప్రజాప్రతినిధిపై ఫిర్యాదు

రుద్రూర్: మండలంలోని సులేమాన్‌నగర్ గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ గౌస్‌పై అతడి వదిన పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈసందర్భంగా ఆమె ఆదివారం మాట్లాడుతూ.. తాను గ్రామంలో లేనిసమయంలో సదరు మాజీ ప్రజాప్రతినిధి తన ఏటీఎం తీసుకుని రెండు పెట్రోల్ బంకుల్లో స్వైప్ చేసి రూ. లక్షా9వేలు తీసుకున్నట్లు ఆవేదన వ్యక్తం చేసింది. విచారణ జరిపి న్యాయం చేయాలని మహిళ విజ్ఞప్తి చేసింది. ఈ విషయమై పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జానకంపేట రైల్వేస్టేషన్‌లో చైన్ స్నాచింగ్

ఖలీల్‌వాడి: జానకంపేట రైల్వేస్టేషన్‌లో ఓ మహిళ మెడలోనుంచి రెండు తులాల బంగారు గొలుసును గుర్తుతెలియని దుండగులు ఎత్తుకెళ్లినట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి ఆదివారం తెలిపారు. వివరాలు ఇలా.. హైదరాబాద్‌కు చెందిన కుమారిరెడ్డి రేణుక(23) తన స్నేహితులతో కలిసి ఆదివారం ఉదయం బాసరకు వెళ్లింది. తిరిగి సాయంత్రం రైలులో ఆమె హైదరాబాద్ వెళుతుండగా జానకంపేట రైల్వేస్టేషన్‌లో క్రాసింగ్ ఉండటంతో ఆగింది. కొద్దిసేపటికి రైలు బయలుదేరగా ప్లాట్‌ఫామ్‌పైన గుర్తు తెలియని ఒక వ్యక్తి తన వద్దకు వచ్చి కిటికీలోంచి తన మెడలో ఉన్న రెండు తులాల బంగారు చైన్ ఎత్తుకెళ్లాడు. వెంటనే ఆమె నిజామాబాద్ రైల్వేస్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకొని, విచారణ చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

మైలారం గ్రామంలో..

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండలంలోని మైలారం గ్రామంలో గల కొచ్చెరి మైసమ్మ ఆలయం వద్ద చైన్ స్నాచింగ్ జరిగింది. బాధితురాలు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. బాన్సువాడ మండలం తాడ్కోల్ గ్రామానికి చెందిన లక్ష్మి తన బంధువుల శుభకార్యం నిమిత్తం ఆదివారం కొచ్చెరి మైసమ్మ ఆలయానికి వచ్చింది. తిరుగు ప్రయాణంలో ఆమె ఆలయం నుంచి వెళ్తుండగా వెనుకనుంచి బైక్‌పై గుర్తుతెలియని వ్యక్తి వచ్చి మెడలోని పుస్తెలతాడును ఎత్తుకెళ్లాడు. వెంటనే ఆమె పోలీసులను ఆశ్రయించగా, విషయం తెలుసుకున్న బాన్సువాడ రూరల్ సీఐ రాజేష్ నస్రుల్లాబాద్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి బాధితురాలితో మాట్లాడారు. వెంటనే దర్యాప్తు చేయాలని ఎస్సై లావణ్యను ఆదేశించారు.

మద్నూర్‌లో పెంటకుప్ప దగ్ధం



మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలోని గాంధీచౌక్‌లో ఆదివారం ప్రమాదవశాత్తు పెంటకుప్ప దగ్ధమయినట్లు బాధితుడు హుల్లాజీ తెలిపారు. తన ఇంటికి సమీపంలో గల పెంటకుప్పకు ప్రమాదవశాత్తు నిప్పు అంటుకోవడంతో మంటలు చెలరేగాయని ఆయన తెలిపారు. ఈ విషయమై ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించడంతో వారు వచ్చి మంటలను ఆర్పివేశారన్నారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.పదివేల నష్టం జరిగిందని వారు తెలిపారు.

ఆన్‌లైన్ సేవలకు అంతరాయం

- నిజామాబాద్ బల్దియాలో వారం రోజులుగా పనిచేయని ఇంటర్‌నెట్
- పట్టించుకోని అధికారులు



బల్దియా కార్యాలయం

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఇంటర్‌నెట్ సేవలు నిలిచిపోయాయి. గత వారం రోజులుగా ఇంటర్‌నెట్ పనిచేయకపోవడంతో పలు ఆన్‌లైన్ పనులు నిలిచిపోయాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినవస్తున్నాయి.

ఇబ్బందుల్లో ప్రజలు..

బల్దియా కార్యాలయంలో మొత్తం 56 కంప్యూటర్‌లు ఉన్నాయి. ముఖ్యమైన విభాగాలైన రెవెన్యూ, ఇంజినీరింగ్, టౌన్‌ప్లానింగ్, జనన, మరణ ధృవీకరణ పత్రాల మంజూరీ విభాగం, ఎస్టాబ్లిష్‌మెంట్, మెప్మా విభాగాలున్నాయి. బల్దియా కార్యాలయంలో ప్రతీ పని ఆన్‌లైన్‌తో ముడిపడిందే. ఏ సమాచారం కావాలన్నా ఆన్‌లైన్‌లో చూడాల్సిందే. ప్రతీ సమాచారం ఆయా వెబ్‌సైట్లలో నిక్షిప్తమై ఉంటుంది. పనుల వివరాలు, సమాచారం కూడా ఆన్‌లైన్‌లోనే నమోదుచేస్తారు. అనుమతులు, బిల్లులు చెల్లించినా, రశీదులు తీయాలన్నా, ఇతర సమాచారం అంతా ఆన్‌లైన్‌లోనే ఉంటుంది. బల్దియా కార్యాలయంలో 100 ఎంబీపీఎస్ సామర్థ్యం గల ఇంటర్‌నెట్‌ను వాడుతున్నారు. అయితే గత వారం రోజులుగా ఇంటర్‌నెట్ రావడం లేదు. దీంతో ఆన్‌లైన్ సేవలకు అంతరాయం కలుగుతోంది. బల్దియా సిబ్బంది మొత్తం ఆస్తిపన్ను వసూళ్లలో బిజీగా ఉండటంతో ఇతర పనులు పెద్దగా చేయడం లేదు. దాంతో కంప్యూటర్ ఆపరేటర్లు ఇంటర్‌నెట్ కనెక్షన్ కోసం ఎదురుచూస్తున్నారు.

సమస్య వాస్తవమే..

కార్పొరేషన్లో కొద్ది రోజులుగా ఇంటర్‌నెట్ సమస్య వస్తోంది. దాంతో ఆన్‌లైన్ పనులకు కొంతమేర అంతరాయం కలుగుతోంది. ఆఫ్‌లైన్ పనులు జరుగుతున్నాయి. ఇంటర్‌నెట్ సమస్యను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లాం. ఈ సమస్యను వెంటనే పరిష్కరించనున్నాం.

–చైతన్య, సిస్టమ్ అసిస్టెంట్ మేనేజర్

కుళ్లిపోయిన మటన్ అమ్ముతున్నారని ఫిర్యాదు



తనిఖీ చేస్తున్న పంచాయతీ సిబ్బంది

బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలోని మటన్ షాపుల్లో కుళ్లిపోయిన మేక మాంసం అమ్ముతున్నారని ఆదివారం పంచాయతీ, వెటర్నరీ అధికారులకు ప్రజలు ఫిర్యాదు చేశారు. దీంతో పంచాయతీ సిబ్బంది మటన్ విక్రయించే షాపులకు వెళ్లి తనిఖీ చేశారు. రెండు రోజుల క్రితం కోసిన మేక మాంసం ఫ్రిజ్‌లో పెట్టి అమ్ముతున్నారని, వాసన వస్తుందని అధికారులు తెలిపారు. ఇలాంటి మాంసం అమ్మితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మాంసం కోసం కోస్తున్న మేకలు, గొర్రెలు ఆరోగ్యంగా ఉన్నాయా లేదా వెటర్నరీ అధికారులు పరిశీలించకుండానే కోస్తున్నారు. అలాగే చాలా మంది చికెన్, మటన్ షాపుల లైసెన్స్ లేకుండానే నిర్వహిస్తున్నారు. వారిపై చర్యలు తీసుకోవాలని మాంసంప్రియులు కోరుతున్నారు.

జిల్లాకు మంత్రి పదవి కేటాయించాలి



మాట్లాడుతున్న డీసీఎంఎస్ చైర్మన్ తారాచంద్

మోపాల్: జిల్లాకు మంత్రి పదవి కేటాయించాలని కాంగ్రెస్ ఆదివాసీ గిరిజన జిల్లా చైర్మన్ కెతావత్ యాదగిరి, డీసీఎంఎస్ ఉమ్మడి జిల్లా చైర్మన్ తారాచంద్ నాయక్ సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం నగరశివారులోని బోర్గాం(పి)లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 14 నెలలు కావస్తోందని, రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజాపాలన సాగిస్తూ ప్రజల మన్ననలు పొందుతుందని తెలిపారు. ఉమ్మడి జిల్లా నుంచి మంత్రివర్గంలో చోటు లభించలేదని, పార్టీ సీనియర్ నాయకుడు సుదర్శన్‌రెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలని గిరిజనుల సమావేశంలో తీర్మానం చేశామన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు జిల్లాకు రెండు మంత్రి పదవులు, స్పీకర్ పదవి ఇచ్చారని గుర్తుచేశారు. రాజకీయంగా ఎంతో చైతన్యం కలిగిన జిల్లా నిజామాబాద్ అని, కాంగ్రెస్‌కు గిరిజనులు, ఆదివాసీలు మొదటి నుంచి మద్దతుగా నిలుస్తున్నారని తెలిపారు. సమావేశంలో మాజీ ఎంపీటీసీలు బుస్నె రవీందర్, వెంకట్రామ్, మాజీ సర్పంచ్ గంగారాం నాయక్, ఎస్టీ సెల్ అధ్యక్షుడు రవి నాయక్ పాల్గొన్నారు.

అడవుల విస్తీర్ణం పెంచిన ఘనత కేసీఆర్‌దే..

మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్



తన నివాసంలో మొక్క నాటిన బాజిరెడ్డి గోవర్ధన్

మోపాల్: రాష్ట్రంలో హరితహారం, వృక్షార్చన వంటి కార్యక్రమాలను ఉద్యమంలా చేపట్టి అడవుల విస్తీర్ణం 6 నుంచి 7 శాతం పెంచిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని రూరల్ మాజీ ఎమ్మెల్యే, ఆర్టీసీ మాజీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ పేర్కొన్నారు. మాజీ సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా ఆదివారం నగరంలోని మహాలక్ష్మీనగర్‌లో ఉన్న తన నివాసంలో బాజిరెడ్డి గోవర్ధన్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కేసీఆర్‌కు ఆయన జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కేసీఆర్ పాలనలో అన్నివర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని, ఈ ప్రభుత్వ పాలనలో ఏ వర్గం ప్రజలు కూడా సంతోషంగా లేరని తెలిపారు. ప్రజలు కేసీఆర్‌ను గుర్తు చేసుకుంటున్నారని, ఎన్నికలు ఎప్పుడు జరిగినా బీఆర్‌ఎస్ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తంచేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్, మధుకర్‌రావు, బాజిరెడ్డి రమాకాంత్, చంద్రన్న తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సంకష్టహర చతుర్థి





శుభం కరోతి గణపతి ఆలయంలో పూజలో పాల్గొన్న భక్తులు.. మహాగణపతి ఆలయంలో..

నిజామాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలో సంకష్టహర చతుర్థి వేడుకలను ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నగరంలోని సార్వజనిక్ గణేశ్ మండలి గణపతి ఆలయంలో ఆదివారం ఉదయం గణనాథునికి పంచామృతాభిషేకం, గరిక పూజ, ప్రత్యేక పూజలు చేశారు. బొడ్డెమ్మ చెరువు వద్ద ఉన్న మహాగణపతి ఆలయంలో, గాయత్రినగర్‌లో ఉన్న సిద్ధి వినాయకస్వామి ఆలయంలో, మున్సిపల్ కార్యాలయంలో ఎదుట ఉన్న శుభం కరోతి గణపతి ఆలయంలో స్వామివారికి హారతి, అర్చన విశేష పూజా కార్యక్రమాలు చేపట్టారు. భక్తులు ఆలయాల్లో పూజలు చేశారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. శ్రీసాయికృప షిరిడీనగర్‌లో ఉన్న శ్రీభూలక్ష్మీ మాత ఆలయంలో హోమం చేశారు.

పోచమ్మ ఆలయంలో పూజలు

సిరికొండ: మండల కేంద్రంలోని పోచమ్మ ఆలయంలో భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు అమ్మవారికి నైవేద్యాలను సమర్పించి, అందరినీ చల్లగా చూడాలని వేడుకున్నారు.



సిరికొండలో పూజలు చేస్తున్న భక్తులు

తాళం వేసిన ఇంట్లో చోరీ

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండలంలోని దుర్కి గ్రామంలో తాళం వేసిన ఓ ఇంట్లో చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన రేఖవార్ రాజు తన భార్య స్వరూపారాణితో కలిసి ఈ నెల 9న ఇంటికి తాళం వేసి మహాకుంభమేళ కోసం ప్రయాగ్ రాజ్‌కు వెళ్లారు. ఈనెల 15న పక్కింటి వారు వాళ్లకి ఫోన్ చేసి, మీ ఇంటి తలుపులు తెరచి ఉన్నాయంటూ సమాచారం అందించారు. వారు ఆదివారం ఇంటికి వచ్చి చూడగా, చోరీ జరిగినట్లు గుర్తించి, పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి వచ్చిన పోలీసులు వివరాలు సేకరించారు. తాళం పగలగొట్టిన గుర్తుతెలియని దుండగులు ఇంట్లోని సుమారు 3తులాల బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. ఈమేరకు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లావణ్య తెలిపారు.